క్లుప్తంగా

శ్రీశైలంకు శివ స్వాముల పయనం



ఇరుముడులు కడుతున్న శివ స్వాములు

ద్వారకాతిరుమల: క్షేత్రపాలకుడైన భ్రమరాంబ మల్లేశ్వర స్వామి ఆలయంలో శివ దీక్షాధారులు బుధవారం ఇరుముడులు ధరించి, శ్రీశైలం క్షేత్రానికి పయనమయ్యారు. భక్తుల శివ నామస్మరణలతో క్షేత్ర పరిసరాలు మార్మోగాయి. తొలుత ఆలయ ముఖ మండపంలో శివ దీక్షాధారులతో గురుస్వామి ఇరుముడులు కట్టించారు. ఇరుముడులను శిరస్సుపై ధరించి, బంధు మిత్రులతో కలిసి ఆలయంలో ప్రదక్షిణలు చేశారు. స్వామి, అమ్మవార్లను దర్శించారు. అనంతరం దీక్షాధారులు శ్రీశైలం క్షేత్రానికి పయనమయ్యారు.

రెండో రోజుకు పోస్టల్ ఉద్యోగుల సమ్మె



సమ్మె నిర్వహిస్తున్న పోస్టల్ ఉద్యోగులు

జంగారెడ్డిగూడెం: ఆల్ ఇండియా గ్రామీణ తపాలా ఉద్యోగుల నిర్వధిక సమ్మె బుధవారం రెండో రోజుకు చేరింది. స్థానిక హెడ్‌పోస్టాఫీసు వద్ద ఉద్యోగులు ప్రభుత్వం గ్రామీణ తపాలా ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ఏర్పాటుచేసిన కమలేష్ చంద్ర కమిటీ సిఫార్సులను వెంటనే అమలుచేయాలని కోరారు. ఏలూరు డివిజన్ ఏఐజీడీఎస్‌యూ అధ్యక్షుడు ఎం.నాగేశ్వరావు, సెక్రెటరీ ఎస్ఎస్ బాజీ, కోశాధికారి దుర్గాప్రసాద్, అసిస్టెంట్ సెక్రటరీ దుర్గారావు, గౌరవ అధ్యక్షులు ఎస్ బాజీ పాల్గొన్నారు.

ట్యాబ్‌ల పంపిణీ

టి.నరసాపురం: ప్రపంచ దివ్యాంగుల దినోత్సవాన్ని టి.నరసాపురం ఎంపీపీ స్కూల్‌లో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేశారు. జిల్లా స్థాయి ఆటల పోటీల్లో విజేతలకు సర్టిఫికెట్‌లు, బహుమతులు అందజేశారు. దివ్యాంగ విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలని ఎంఈఓ రామ్మూర్తి ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎంపీపీ స్కూల్ హెచ్ఎం , ఐఈడీఎస్ఎస్ వీరాస్వామి, భవిత కేంద్రం ప్రత్యేక ఉపాధ్యాయులు (ఐఈఆర్‌టీ) కె.రాజు, జె.పృధ్వీరాజు, ఉపాధ్యాయులు, దివ్యాంగ పిల్లలు తల్లితండ్రులు పాల్గొన్నారు.

17 నుంచి ఆడుదాం ఆంధ్ర



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ వెంకటరెడ్డి

పోలవరం రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఆడు దాం ఆంధ్ర టోర్నమెంట్‌ను విజయవంతం చే యాలని ఎంపీపీ సుంకర వెంకటరెడ్డి తెలిపా రు. పోలవరం మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం మండల పరిధిలోని 15 గ్రామ సచివాలయాల పరిధిలో ఈ నెల 17 నుంచి కార్యక్రమాలు ప్రారంభమవుతాయన్నారు. మండల స్థాయి, సచివాలయ సిబ్బంది, పీఈటీలు క్రీడల్లో పాల్గొనే విద్యార్థులకు సూచనలివ్వాలన్నారు. ఎంపీడీఓ జి.శ్రీను, ఎంఈఓ ఎల్ చూడామణి, ఎంపీటీసీ యామల శ్రీదేవి, కోఆప్షన్ సభ్యుడు ఎస్‌కే ఖాన్ పాల్గొన్నారు.

వికసిత్ భారత్ సంకల్ప యాత్ర

పోలవరం రూరల్: పోలవరం మండలం పట్టిసీమ, పోలవరం గ్రామ పంచాయతీ కార్యాలయాల వద్ద వికసిత్ భారత్ సంకల్ప యాత్ర బుధవారం నిర్వహించారు. పోలవరం గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద సర్పంచ్ పాదుం పుష్ప, పట్టిసీమ గ్రామపంచాయతీ వద్ద సర్పంచ్ సబ్బారావు శ్రీరామమూర్తి అధ్యక్షతన నిర్వహించిన ఈ సమావేశాల్లో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రభుత్వ సంక్షేమ పథకాలపై పలు శాఖల అధికారులు ప్రజలకు తెలిపారు. సంక్షేమ పథకాలు పూర్తిస్థాయిలో, సక్రమంగా అందుతున్నాయా లేదా అనేది తెలుసుకున్నారు. వైఎస్సార్ సీపీ నాయకులు, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

కొమ్ముగూడెంలో చోరీ

చింతలపూడి: మండలం కొమ్ముగూడెం గ్రామంలో తాళాలు పగలకొట్టి ఇంట్లోకి చొరబడి చోరీకి పాల్పడిన ఘటన బుధవారం చోటు చేసుకుంది. ఎస్సై కె.ప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం కొమ్ముగూడెంకు చెందిన వనం రాధ కూలి పనులకు వెళ్తుంది. ఇటీవల రాధకు రూ.లక్షా 30 వేలు డ్వాక్రా డబ్బులు వచ్చాయి. మంగళవారం రాధ యథావిధిగా కూలి పనులకెళ్లింది. ఈ సమయంలో ఇంట్లో ఉన్న నగదును అపహరించుకు పోయారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేపట్టినట్టు ఎస్సై వివరించారు.

సీఎం జగన్ సంక్షేమ పాలన దేశానికే ఆదర్శం

ఎమ్మెల్యే తెల్లం బాలరాజు



కొయ్యలగూడెం : జగనన్న పల్లెబాటలో పాల్గొన్న ఎమ్మెల్యే బాలరాజు



ద్వారకాతిరుమల : రామసింగవరంలో సంక్షేమ బోర్డు ఆవిష్కరణ



చింతలపూడి : ఉర్లగూడెంలో పథకాల బోర్డు ప్రారంభం

కొయ్యలగూడెం: ఆంధ్రప్రదేశ్‌లో వచ్చేది మళ్లీ జగనన్న ప్రభుత్వమేనని ఎమ్మెల్యే తెల్లం బాలరాజు పేర్కొన్నారు. కొయ్యలగూడెం మండలం పరంపూడి సచివాలయం-4 పరిధిలో బుధవారం సాయంత్రం నిర్వహించిన జగనన్న పల్లె బాట కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. దివాళా కోరు రాజకీయాలకు చంద్రబాబు నాయుడు పెట్టింది పేరని ఆరోపించారు. ఆయన పాలనను తలుచుకోవడానికే ప్రజలు భయభ్రాంతులకు లోనవుతున్నారని చెప్పారు. సంక్షేమ పథకాలతో దేశానికి ఆదర్శంగా నిలిచిన జగన్ ప్రభుత్వం వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో విజయం సాధించడం ఖాయమన్నారు. ఇంటింటికీ వెళ్లి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి ఓటు ఎందుకు వేయాలో వివరించారు. ప్రజాభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. తొలుత సచివాలయం వద్ద వాలంటీర్లకు, గృహ సారథులకు సచివాలయ కన్వీనర్లకు ప్రభుత్వ విధివిధానాలు గురించి వివరించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఆర్ బేబీ శ్రీలక్ష్మి, ఎంపీపీ గంజిమాల రామారావు, జెడ్పీటీసీ దాసరి శ్రీలక్ష్మి, పీఏసీఎస్ అధ్యక్షుడు మంతెన సోమరాజు, మాజీ ఎంపీపీ మట్ట సత్తిపండు, ఎంపీటీసీలు ఘంటసాల శీనమ్మ, గంటా శ్రీను, ఎస్‌కే బాజీ, గొడ్డటి నాగేశ్వరరావు, నూకల రాము, తదితరులు పాల్గొన్నారు.

జగన్ హయాంలో ప్రతి ఒక్కరికీ న్యాయం

చింతలపూడి : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలనలో ప్రతి పేదవారికీ న్యాయం జరిగిందని సర్పంచ్ కె.యువరాజు అన్నారు. చింతలపూడి మండలం ఉర్లగూడెం సచివాలయంలో బుధవారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్రంలో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాలకు న్యాయం జరిగింది సర్పంచ్ యువరాజు అన్నారు. నాలుగున్నరేళ్లలో ప్రభుత్వం ద్వారా అందిన సంక్షేమ లబ్ధిని వివరించే సంక్షేమ పథకాల డిస్‌ప్లేను ప్రారంభించారు. తొలుత వైఎస్సార్ సీపీ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఈఓ పీఆర్డీ విక్టర్ బాబు, ఎంపీటీసీ నారపాం మల్లేశ్వర్రావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

తాడువాయిలో 'వై ఏపీ నీడ్స్ జగన్'

జంగారెడ్డిగూడెం రూరల్: మండలంలోని తాడువాయిలో ఆంధ్రప్రదేశ్‌కి జగన్ ఎందుకు కావాలి కార్యక్రమం నిర్వహించారు. ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు ప్రజల వద్దకెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. వైఎస్సార్‌సీపీ జెండాను ఎగురు వేశారు. సర్పంచ్ యరమాల సత్యవతి, ఎంపీపీ కొదమ జ్యోతి, జెడ్పీటీసీ పోల్నాటి బాబ్జి వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు వామిశెట్టి హరిబాబు, పార్టీ నాయకులు కనికళ్ల ప్రసాద్ బాబు, వీరెంకి సత్యనారాయణ సత్రం వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమం, అభివృద్ధికి చిరునామా ఏపీ

ద్వారకాతిరుమల: జగనన్నతోనే రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధి సాధ్యమని, సంక్షేమానికి, అభివృద్ధికి ఆంధ్రప్రదేశ్ చిరునామాగా నిలిచిందని రాష్ట్ర ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ చెలికాని రాజబాబు అన్నారు. ద్వారకాతిరుమల మండలం రామసింగవరంలో బుధవారం నిర్వహించిన వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో రాజబాబు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ప్రతాపనేని వాసులు పాల్గొన్నారు. వైఎస్సార్ సీపీ జెండాను ఆవిష్కరించారు. ప్రభుత్వం నాలుగున్నరేళ్లలో చేసిన సంక్షేమం, అభివృద్ధి వివరాల బోర్డును ప్రారంభించారు. ఈ సందర్భంగా రాజబాబు, వాసు మాట్లాడుతూ సీఎం జగన్ రాష్ట్రాభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్నారని చెప్పారు. గతంలో ఎన్నడూ లేని విధంగా అన్ని వర్గాల వారికి పథకాలు అందుతున్నాయని వివరించారు. ప్రస్తుతం అమలవుతున్న సంక్షేమ పథకాల లబ్ధితో ప్రతి పేదవాని మోములో ఉన్న చిరునవ్వు శాశ్వతం కావాలంటే జగన్ మళ్లీ రావాలని అన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ చిగురుపల్లి శామ్యూల్, సర్పంచ్ ఆకురాతి ధానేశ్వరరావు, ఎంపీటీసీ మానికల లవరాజు, చల్లారావు, ఉప్పల మునేశ్వరరావు, కనికెల్లి ఏసు, బిరుదుగడ్డ సుభాకరరావు, కోఆప్షన్ సభ్యుడు షేక్ భాషా, పెన్మత్స చక్రవర్తి రాజు, పెన్మత్స కొండరాజు తదితరులున్నారు.

సీఎం జగన్‌తోనే అభివృద్ధి సాధ్యం

కామవరపుకోట: సీఎం జగన్‌తోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమైందని ఎంపీపీ మేడవర విజయలక్ష్మి, జెడ్పీటీసీ కడిమి రమేష్ అన్నారు. బుధవారం కామవరపుకోట మండలం వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మిడతా రమేష్ బాబు ఆధ్వర్యంలో ఆంధ్రకు జగనే ఎందుకు కావాలి, కార్యక్రమం నిర్వహించారు. బస్టాండ్ ఎదురుగా ఉన్న వైఎస్ విగ్రహానికి పూలమాలు వేసి నివాళులు అర్పించారు. వైఎస్సార్ సీపీ జెండా ఎగురవేశారు. గ్రామ సచివాలయ ఆవరణలో సంక్షేమ పథకాల డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరించారు. గ్రామస్తులకు ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాల లబ్ధిని వివరించి, మా నమ్మకం నువ్వే జగన్ కిట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కరిపోతు అనూష, వైఎస్సార్ సీపీ టౌన్ కన్వీనర్ నానాది సాగర్, వైస్ ఎంపీపీ తమ్మిశెట్టి గిరిజ, ఎంపీటీసీ మేడంకి పద్మ, గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లు, గ్రామ వాలంటీర్లు పాల్గొన్నారు.



కామవరపుకోట : వైఎస్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

18న వైఎస్సార్ సీపీ మండల సమావేశం

టి.నరసాపురం: టి.నరసాపురం మండలం తిరుమలదేవిపేటలో ఈ నెల 18న సోమవారం వైఎస్సార్ సీపీ మండల స్థాయి సమావేశం నిర్వహించనున్నట్టు జెడ్పీటీసీ సామంతపూడి బాల సూర్యనారాయణరాజు తెలిపారు. ఈ మేరకు బుధవారం బండివారిగూడెంలో ఆయన పార్టీ ముఖ్యనేతలతో సన్నాహక సమావేశం నిర్వహించారు.

ఇసుక సరఫరాను పునరుద్ధరించాలి

ఏలూరు (టూటౌన్): ఇసుక సరఫరాను పునరుద్ధరించి కార్మికుల ఉపాధి కాపాడాలని కోరుతూ ఏలూరు జిల్లా బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ సీఐటీయూ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టరేట్ వద్ద కార్మికులు బుధవారం అర్ధనగ్నంగా ధర్నా చేశారు. యూనియన్ జిల్లా అధ్యక్షులు ఎర్ర రాంబాబు అధ్యక్షతన జరిగిన ఈ ధర్నాలో సంఘం రాష్ట్ర అధ్యక్షులు నారపల్లి రమణారావు, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బి.సోమయ్య మాట్లాడారు. కలెక్టరేట్లో డీఆర్వో వెంకటేశ్వర్లుకు వినతి పత్రం అందించారు.

డిమాండ్లను నెరవేర్చాలి

జంగారెడ్డిగూడెం: తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని రాష్ట్ర మున్సిపల్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీనివాస్ డిమాండ్ చేశారు. బుధవారం జంగారెడ్డిగూడెం పాత మున్సిపల్ కార్యాలయం నుంచి కొత్త మున్సిపల్ కార్యాలయం వరకు మున్సిపల్ కార్మికులు ర్యాలీ నిర్వహించారు. సమస్య పరిష్కారం కోరుతూ డిసెంబర్ 27 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా సమ్మెకు వెళ్తున్నట్టు శ్రీనివాస్ తెలిపారు. మున్సిపల్ కమిషనర్ పి.భవానీ ప్రసాద్‌కు సమ్మె నోటీసు అందజేశారు. రాష్ట్ర మున్సిపల్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) రాష్ట్ర ఉపాధ్యక్షుడు భజంత్రీ శ్రీనివాస్, ఏలూరు జిల్లా అధ్యక్షుడు కె.విఘ్నేష్ మాట్లాడారు.

గ్రామాల అభివృద్ధికి బాటలు



టి.నరసాపురం : సీతంపేటలో పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే బాలరాజు



కామవరపుకోట : జీలకరగ్రూడెంలో పథకాల బుక్లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే

టి.నరసాపురం: మౌలిక వసతుల కల్పనతో గ్రామాల రూపురేఖలను వైఎస్సార్ సీపీ ప్రభుత్వం మార్చుతోందని పోలవరం ఎమ్మెల్యే తెల్లం బాలరాజు అన్నారు. టి.నరసాపురం మండలం బండివారిగూడెం, కొత్త సీతంపేట గ్రామాల్లో బుధవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారులకు ఇప్పటి వరకు ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాల లబ్ధిని వివరించారు. ఈ సందర్భంగా బాలరాజు మాట్లాడుతూ లేఅవుట్ కాలనీల్లో ఇప్పటికే మౌలిక వసతుల కల్పన పూర్తవుతుందని చెప్పారు. రోడ్ల నిర్మాణం, మంచినీటి సౌకర్యం, విద్యుత్ లైన్ల నిర్మాణం, విద్యుదీకరణ వంటి పనులు పూర్తి చేశామన్నారు. మిగిలిన డ్రెయిన్ నిర్మాణ పనులను దశల వారీగా చేపడుతున్నట్టు చెప్పారు. ప్రజలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చిన సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. టీడీపీ హయాంలో కాలనీ ఇళ్ల లబ్ధిదారులకు ఒక్కరూపాయి బిల్లు చెల్లించి ఆ ప్రభుత్వం మోసం చేసిందన్నారు. ఈ విషయాన్ని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లానని, త్వరలోనే లబ్ధిదారులకు న్యాయం చేకూరుతుందని వివరించారు.

పింఛన్ మంజూరుపై దృష్టి

అర్హత ఉండి లబ్ధి పొందని దివ్యాంగులకు పింఛన్ మంజూరు కోసం ప్రత్యేక దృష్టి సారించనున్నట్టు ఎమ్మెల్యే బాలరాజు తెలిపారు. బండివారిగూడెంలో పోకల సాయిలక్ష్మి, భూక్యా కావ్యలు అంగవైకల్యం ఉన్నప్పటికీ పింఛన్ రావడం లేదని ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. పోకల సాయిలక్ష్మి కంటిని బాలరాజు పరిశీలించారు. దివ్యాంగులు సదరస్ ధ్రువీకరణ పత్రాన్ని పొందిన వెంటనే పింఛన్‌కు మంజూరు చేయాలని ఎమ్మెల్యే అధికారులకు సూచించారు. ఆయా కార్యక్రమాల్లో జెడ్పీటీసీ సామంతపూడి బాల సూర్యనారాయణరాజు, ఎంపీపీ దారబోయిన లక్ష్మీ వెంకటేశ్వరరావు, పార్టీ మండలాధ్యక్షులు శ్రీనురాజు, దాసరి రాంబాబు, నాగులు, దాకారపు సూరిబాబు, ఎంపీటీసీలు చింతం నాగమణి, నార్లపాటి వెంకటరావు, అర్జా బాలయ్య, సుంకవల్లి నరసింహారావు, ముత్తంశెట్టి లక్ష్మణరావు, గుర్రం నాగేశ్వరరావు, కురసం నిరీక్షణ రావు, తహసీల్దార్ జేవీ సుబ్బారావు, కార్యదర్శి నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

జగన్ పాలనలో రాష్ట్రం సుభిక్షం

కామవరపుకోట: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో రాష్ట్రం సుభిక్షంగా ఉందని ఎమ్మెల్యే ఉన్నమట్ల ఎలీజ అన్నారు. బుధవారం కామవరపుకోట మండలం గుంటుపల్లి గ్రామ పంచాయతీ జీలకరగ్రూడెంలో ఆయన గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారులకు ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలు వివరిస్తూ, వారికి అందించిన సంక్షేమ పథకాల బుక్లెట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఎలీజా మాట్లాడుతూ టీడీపీ హయాంలో ప్రభుత్వం పేదల సంక్షేమాన్ని, అభివృద్ధిని గాలికి వదిలేసిందన్నారు. గతంలో పింఛను అందుకోవాలంటే వృద్ధులు, వికలాంగులు ప్రభుత్వ కార్యాలయాలు చుట్టూ తిరుగుతూ ఇబ్బందులుకు గురయ్యేవారని, ప్రభుత్వ పథకాలు పొందాలంటే, జన్మభూమి కమిటీ పేరుతో ప్రజలు నానా అవస్థలు ఎదుర్కొనే వారిని గుర్తుచేశారు. టీడీపీ హయాంలో రాష్ట్ర ప్రజల అవస్థలు చూసి చలించిపోయిన జగన్ మోహన్‌రెడ్డి పరిపాలన చేపట్టిన వెంటనే, రాష్ట్రంలోని ప్రతి పేదవాడు ఆర్థిక అభివృద్ధిని పొందాలనే లక్ష్యంతో నవరత్నాలను తీసుకొచ్చి సచివాలయ వ్యవస్థ ద్వారా పారదర్శకంగా అమలు చేస్తున్నారని తెలిపారు. హామీలను నూరుశాతం నెరవేర్చి, పేదల ఆర్థిక అభివృద్ధికి తోడ్పడ్డ సీఎం జగన్ వైపే ప్రజలు చూస్తున్నారని వివరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ మిడత రమేష్ బాబు, రాష్ట్ర క్రిస్టియన్ మైనార్టీ డైరెక్టర్ పందు జగదీష్, కొమ్మి నరేష్, నాగళ్ల సీతారాంబాబు, తోట దావీదు, టోకూరి ఆశీర్వాదం, కొప్పాక రామకృష్ణ, తుమ్మల సీతారామయ్య, గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లు పాల్గొన్నారు.

సేవాభావంతో మెలగాలి



సెమీ క్రిస్మస్ వేడుకలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బాలరాజు

టి.నరసాపురం: ప్రజలందరూ శాంతి సౌఖ్యాలతో వెలుగొందాలని ఎమ్మెల్యే తెల్లం బాలరాజు ఆకాంక్షించారు. టి.నరసాపురం మండలం కృష్ణాపురంలో బుధవారం సెమీ క్రిస్మస్ వేడుకలో ఆయన పాల్గొని కేక్ కట్‌చేశారు. క్రీస్తు మార్గాన్ని అనుసరించి, తోటి వారిపట్ల సేవా భావంతో మెగలగాలని సూచించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సామంతపూడి బాల సూర్యనారాయణరాజు, ఎంపీపీ దారబోయిన లక్ష్మీ వెంకటేశ్వరరావు, పార్టీ మండలాధ్యక్షుడు శ్రీనురాజు, దేవరపల్లి సీతారామ్‌ప్రసాద్, ఎంపీటీసీ సభ్యులు నార్లపాటి వెంకటరావు, అర్జా బాలయ్య, కురసం నిరీక్షణరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన

కొయ్యలగూడెం: శ్రీ చక్ర సహిత కనకదుర్గమ్మ ఆలయ పునర్నిర్మాణానికి గురువారం శంకుస్థాపన చేయనున్నట్టు ఆలయ అర్చకులు మామిళ్లపల్లి సుబ్రహ్మణ్య శర్మ తెలిపారు. ఉదయం 9.35 గంటలకు ఆలయ కమిటీ చైర్మన్ మంతెన సోమరాజు శంకుస్థాపన చేయనున్నట్టు పేర్కొన్నారు. కన్నాపురం రోడ్డులో 43 ఏళ్ల క్రితం నిర్మించిన అమ్మవారి ఆలయాన్ని సుమారు రూ.40 లక్షలతో పునర్నిర్మించనున్నట్టు తెలిపారు. అభ్యుదయ సేవా కమిటీ ఆధ్వర్యంలో వచ్చే ఉగాది నాటికి ఆలయ నిర్మాణం పూర్తి చేయాలనే సంకల్పంతో ఉన్నామన్నారు.

హైస్కూల్‌గా దొరమామిడి ఎంపీయూపీ స్కూల్ అప్‌గ్రేడ్

బుట్టాయగూడెం: మండలంలోని దొరమామిడి మండల పరిషత్ యూపీ స్కూల్‌ను జిల్లా పరిషత్ హైస్కూల్‌గా అప్‌గ్రేడ్ చేస్తూ బుధవారం ఏపీ స్కూల్ ఎడ్యుకేషన్ డిపార్ట్‌మెంట్ నుంచి ఉత్తర్వుల వచ్చాయి. దొరమామిడి పరిసర ప్రాంతాల్లోని విద్యార్థుల సౌకర్యార్థం హైస్కూల్‌గా మార్చే విధంగా ప్రభుత్వానికి దరఖాస్తు పంపినట్లు ఎమ్మెల్యే తెల్లం బాలరాజు తెలిపారు. ఈ మేరకు హైస్కూల్‌గా మారుస్తూ ప్రభుత్వం జీఓ ఇచ్చినట్లు ఆయన తెలిపారు.

మోటార్ సైకిల్ ర్యాలీ

జంగారెడ్డిగూడెం: ఆంధ్రప్రదేశ్ ల్యాండ్ టైటిల్ యాక్ట్, 2022ని వ్యతిరేకిస్తూ చేపట్టిన నిరసనలో భాగంగా నాయవాదులు జంగారెడ్డిగూడెం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పట్టణంలో బుధవారం మోటార్ సైకిల్ ర్యాలీ నిర్వహించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అచ్యుత శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడు తల్లాడి అశోక్ కుమార్, కార్యదర్శి ఏవీవీ భువనేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలను తెరిపించిన ఎంపీడీఓ

జంగారెడ్డిగూడెం రూరల్: మండలంలోని అంగన్‌వాడీ సెంటర్లను తెరిపించామని ఎంపీడీఓ కె.విజయ్‌ప్రసాద్ తెలిపారు. అంగన్‌వాడీ ద్వారా చిన్నారులకు పౌష్టికాహారం అందేలా చర్యలు చేపట్టామన్నారు. మహిళా పోలీసుల సంరక్షణలో సెంటర్ల ద్వారా అంగన్‌వాడీలను తెరిపించామని, అంగన్‌వాడీలు ధర్నా విరమించే వరకు నిత్యం మహిళా పోలీసులు, సచివాలయాల సిబ్బంది పర్యవేక్షణలో కేంద్రాలను తెరిపిస్తామని ఎంపీడీఓ వివరించారు.

కొనసాగుతున్న అంగన్‌వాడీల సమ్మె

బుట్టాయగూడెం: తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ అంగన్‌వాడీ కార్యకర్తల సమ్మె బుధవారం రెండో రోజూ కొనసాగింది. కార్యకర్తలు బుట్టాయగూడెంలో ర్యాలీ నిర్వహించారు. జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాలతో ఎంపీడీఓ, ఎంఈఓ, మహిళా పోలీసుల ఆధ్వర్యంలో అంగన్‌వాడీ పాఠశాలల్లో చిన్నారులకు మధ్యాహ్న భోజనం ఏర్పాట్లు చేశారు.



పంగిడిగూడెంలో అంగన్‌వాడీ కేంద్రాలను తెరిపించిన ఎంపీడీఓ విజయ్ ప్రసాద్

పోలవరంలో..

పోలవరం రూరల్: పోలవరంలో అంగన్‌వాడీ వర్కర్స్ సమ్మె కొనసాగింది. సమస్యలు పరిష్కరించేంత వరకు సమ్మె కొనసాగుతుందని నాయకులు తెలిపారు. సమ్మెకు పలు పార్టీల నాయకులు సంఘీబావం తెలిపారు.

కనకాద్రిపురం చిరుధాన్యాలకు ప్రశంసలు

కొయ్యలగూడెం: మండలంలోని కనకాద్రిపురం చిరుధాన్యాల ఉత్పత్తులకు ఆంధ్రప్రదేశ్ గవర్నర్ మహ్మద్ నజీర్ ప్రశంసలు దక్కాయి. ఏలూరు జిల్లా దెందులూరు మండలం గాలయిగూడెంలో నిర్వహించిన వికసిత్ భారత సంకల్ప యాత్ర సందర్భంగా పలు ప్రభుత్వ శాఖలు కేంద్ర ప్రభుత్వం పథకాలపై స్టాల్స్ ఏర్పాటు చేశాయి. ఇందులో అంతర్జాతీయ చిరుధాన్యాల సంవత్సరాన్ని పురస్కరించుకుని ప్రధాని మోదీ ప్రారంభించిన ప్రధాని సూక్ష్మ ఆహార శుద్ధి పథకం ద్వారా కనకాద్రిపురంలో ప్రారంభించిన గుడ్ హెల్త్ ఆహార ఉత్పత్తులను ప్రదర్శించారు. జిల్లా మొత్తం మీద ఒక్క కనకాద్రిపురం చిరుధాన్యాల ఉత్పత్తులను మాత్రమే ప్రదర్శించామని కొయ్యలగూడెం మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు తోట కృపామణి తెలిపారు.



చిరుధాన్యాలను పరిశీలిస్తున్న గవర్నర్ (ఫైల్)

తమ ఉత్పత్తులను గవర్నర్, కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్, దెందులూరు ఎమ్మెల్యే అబ్బయ్య చౌదరి ప్రశంసించారని పేర్కొన్నారు. ఈ అవకాశం కల్పించిన జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్‌కు కృపామణి ధన్యవాదాలు తెలిపారు.

వేడుకగా పోలి పాడ్యమి



ద్వారకాతిరుమల : పుష్కరణిలో దీపాలు వదులుతున్న మహిళలు



కొయ్యలగూడెం : తూర్పువేట రామాలయం వద్ద..

ద్వారకాతిరుమల: గుండెల్లో భక్తిభావాన్ని నింపుకుని.. నిండు మనస్సుతో మహిళలు కార్తీక దీపాలను కోనేరుల్లో వదిలారు. కార్తీకమాసం ముగింపు, పోలి పాడ్యమిని పురస్కరించుకుని బుధవారం తెల్లవారుజామున మహిళలంతా కలిసి కోనేరుల వద్ద చేసిన సందడి పండుగ వాతావరణాన్ని తలపించింది. ప్రముఖ పుణ్యక్షేత్రమైన ద్వారకాతిరుమలలోని శ్రీవారి పుష్కరణిలో పెద్ద ఎత్తున మహిళలు కార్తీక దీపాలను వదిలారు. ముందుగా కోనేరు వద్ద స్నానాలను ఆచరించారు. కోనేరు మెట్ల వద్ద పసుపు, కుంకుమలతో పోలి అమ్మవారికి విశేష పూజలు చేశారు. అరటి దొప్పల్లో కార్తీక దీపాలను వెలిగించి కోనేరులో వదిలి నమస్కరించారు. కార్తీక మాసంలో దీపాలను వెలిగిస్తే పుణ్యఫలం సిద్ధిస్తుందని, ఆఖరి రోజున కోనేరుల్లో వదిలే దీపాలకు విశేష ప్రాధాన్యత ఉంటుందని పురోహితులు తెలిపారు.

ముగిసిన కార్తీకమాస పూజలు

జంగారెడ్డిగూడెం: స్థానిక ఆటోనగర్ కనకదుర్గమ్మవారి ఆలయం వద్ద బుధవారం పోలి స్వర్గానికి సాగనంపే కార్యక్రమం నిర్వహించారు. ఉదయం నాలుగు గంటల నుంచి కమిటీ ఏర్పాటు చేసిన కొలనులో దీపోత్సవ కార్యక్రమం అంగరంగ వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో మహిళలు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమాలను ఆటో నగర్ మోటార్ ఫీల్డ్ వర్కర్స్ అండ్ ఓనర్స్ అసోసియేషన్ సభ్యులు పర్యవేక్షించారు.

శాస్త్రోక్తంగా శివ, పార్వతుల కల్యాణం



కుక్కునూరు : శివ,పార్వతుల కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం

కుక్కునూరు: కార్తీకమాసం ముగింపు సందర్భంగా బుధవారం కుక్కునూరు శ్రీ కాశీఅన్నపూర్ణసమేత విశ్వేశ్వరస్వామి ఆలయంలో శివ, పార్వతుల కల్యాణ మహోత్సవాన్ని అర్చకులు నవీన్‌శర్మ ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా నిర్వహించారు. తొలుత ఆలయంలో లింగానికి మహన్యాసపూర్వక రుద్రాభిషేకం చేశారు. మంగళవాయిద్యాల నడుమ శివపార్వతుల విగ్రహాలను మండపానికి తరలించి కల్యాణం నిర్వహించారు. మహాఅన్నదాన కార్యక్రమం, సాయంత్రం ఊరేగింపు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

పోలికి వీడ్కోలు

కొయ్యలగూడెం: కార్తీక మాసం ముగింపును పురస్కరించుకొని ఆలయాల వద్ద కార్తీకదీప అలంకరణ కార్యక్రమం నిర్వహించారు. సాంప్రదాయం ప్రకారం పోలీకి వీడ్కోలు పలుకుతూ మహిళలు దీపాలంకరణ చేసి పూజలు చేశారు. గురువారం నుంచి ధనుర్మాసం ప్రారంభం కానున్న నేపథ్యంలో తిరుప్పావై సేవ మదనగోపాల స్వామి ఆలయంలో నిర్వహిస్తున్నట్లు అర్చకులు గుడిపూడి శేషాచార్యులు తెలిపారు.